ఇల్లు దగ్ధం

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

కోటపల్లి, జూన్ 3 : కోటపల్లి మండలం పిన్నారం గ్రామంలో ఆత్రం చంటక్కకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. చంటక్క, ఆమె మనమడు శ్రీనివాస్‌తో కలసి ఆదివారం రాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా, ఇంటి నుండి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. చంటక్క కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి, మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అదుపులోకి రాకపోవడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 వేల నగదు, వరి ధాన్యంతో పాటు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ రాజలింగు సందర్శించి, పంచనామా నిర్వహించారు. తక్షణ సాయంతో 25 కిలోల బియ్యం అందచేశారు. మాజీ సర్పంచ్ గజ్జల చందు ఆర్థికసాయం అందించారు. నిరుపేద కుటుంబమైన చంటక్కను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రాణహితలో మునిగి ఒకరి మృతి

దహెగాం, జూన్ 3 : మండలంలోని మొట్లగూడ పంచాయతీ పరిధి రావులపల్లి గ్రామానికి చెందిన కుడ్మెత గోవిందరావు(45) ఆదివారం ప్రాణహితలో మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందరావు ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి మహారాష్ట్రలోని ప్రాణహిత సరిహద్దు గ్రామమైన తోగువెంకటాపూర్‌కు దైవ దర్శనానికి ఎండ్లబండిపై వెళ్లాడు. మొక్కులు చెల్లించుకున్న అనంతరం ఇంటి వద్ద పని ఉందని మధ్యాహ్నం 3 గంటల సమయంలో నడుచుకుంటూ బయల్దేరాడు. సాయంత్రానికి కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చే సరికి గోవిందరావు కనిపించలేదు. దీంతో గ్రామంలో, బంధువుల ఇండ్లలో వెతికారు. అయినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఉదయం ప్రాణహిత వద్ద వెతుకుతుండగా మృతదేహం కనిపించింది. ఈ మేరకు గోవిందరావు భార్య కుసుమాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

వేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

చెన్నూర్ టౌన్, జూన్ 3 : చెన్నూర్ పట్టణంలోని జగన్నాథ ఆలయంలో ఆదివారం శ్రీ వేంకటేశ్వర కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పట్టణానికి చెందిన పులి పద్మ-దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికుడు డా.బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి వారం రోజులుగా నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి సప్తాహం సోమవారం సంపూర్ణమైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేంకటేశ్వర సప్తాహ ప్రవచనం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నుంచి జగన్నాథ ఆలయ అర్చకుడు మోహనాచారి, ఆయన కుమారులు అనీల్ చారి, అజయ్ చారి ఆధ్వర్యంలో కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కొమ్మెరలో నిర్మాణం పూర్తయిన నూతన అంగన్‌వాడీ భవనం


శిథిలావస్థలో ఉన్న ఇంటిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

అంగన్‌వాడీకి మోక్షమెన్నడో

- ప్రారంభానికి నోచుకోని నూతన భవనం
- పూర్తయి ఏడాది గడిచినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- శిథిలావస్థలో ఉన్న ఇంట్లోనే కొనసాగుతున్న వైనం
- పిల్లలను పంపించేందుకు భయపడుతున్న తల్లిదండ్రులు

చెన్నూర్ రూరల్, జూన్ 3 : చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం.. ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఫలితంగా పిల్లలు ఇబ్బందులుపడుతున్నారు. కొమ్మెరలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఒక కేంద్రానికి ప్రభుత్వం భవనం ఏర్పాటు చేసింది. మరో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో కొన్నేండ్లుగా అద్దె భవనం (పాత ఇల్లు)లోనే కొనసాగుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కృషితో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనానికి రూ.12 మంజూరు చేయించారు. పనులు పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకొచ్చారు. పనులు పూర్తయి ఏడాది దాటినా ఈ భవనం.. ప్రారంభానికి నోచుకోవడంలేదు. శిథిలావస్థలో ఉన్న ఇంటిలో కేంద్రం కొనసాగుతుండడంతో పిల్లలు పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అంగన్‌వాడీ నూతన భవనాన్ని ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రిజల్ట్ డే

- నేటి పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం
- మూడు కేంద్రాల్లో లెక్కింపు.. ఉదయం 8 గంటలకు ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

ఆదిలాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడు(మంగళవారం) జరగనున్నది. ఇందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మే 13వ తేదీన పోలింగ్ జరుగగా, ఈవీఎంలను పటిష్టమైన బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చారు. ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లను టీటీడీసీ.., ఖానాపూర్, నిర్మల్, మథోల్ నియోజకవర్గాల ఓట్లనును సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల.., ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల ఓట్లను సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవనుండగా అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలైన ఓట్లను పోలింగ్ బూత్‌ల ఆధారంగా లెక్కిస్తారు. ఈవీఎంలలో పోలైన ఓట్లను రౌండ్ల వారీగా లెక్కిస్తారు. ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లను నియమించగా, వారికి అధికారులు శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కౌంటింగ్ విధుల్లో 508 మంది..

ప్రతి రౌండ్‌కు 14 టేబుళ్లలో ఓట్లను లెక్కిస్తారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌లో ముగ్గురి చొప్పున సిబ్బంది ఉంటారు. అదనంగా 20 శాతం కలిపి 378 మంది కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు 65 మంది, 17 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 31 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 17 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. కౌంటింగ్ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సోమవారం పరిశీలించారు. ఈ ఎన్నికల్లో తమ విజయంపై బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటల వరకు పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

రైతులకు ఎరువులు అందేలా చూడాలి

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 3 : రైతులకు ఎరువులు, విత్తనాలు అందేలా చూడాలని మండల వ్యవసాయాధికారి రామకృష్ణ అన్నారు. కాగజ్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎరువులను పీఏసీఎస్ మిషన్ ద్వారా అమ్మకాలు చేయాలని, ప్రతి రోజూ ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అధిక మోతాదులో ఎరువుల వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని, రైతులు ఎకరానికి రెండు బస్తాల యూరియా, బస్తా డీఏపీ, బస్తా ఎంఓపీ మాత్రమే వేయాలని సూచించారు. ప్రస్తుతం అన్ని షాపుల్లో బోల్‌గార్డ్ 2 విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తీసుకుంటే దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది, తదితరులున్నారు.

స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో రామకృష్ణ

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నస్పూర్, జూన్ 3 : మంచిర్యాల జిల్లాలో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 2 పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ లాంగ్వేజ్‌కు మొత్తం 334 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 298 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు, 36 మంది గైర్హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. హాజరు శాతం 89.22గా నమోదైనట్లు పేర్కొన్నారు. కాగా, 2 పరీక్షా కేంద్రాలను డీఈవో, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ సందర్శించారు.

రోడ్డుపై అడ్డంగా పడ్డ చెట్టు తొలగింపు

ప్రధాన రహదారిపై పడ్డ చెట్టును తొలగిస్తున్న జేసీబీ

సిర్పూర్(టీ), జూన్ 3 : సిర్పూర్(టీ)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై పెద్దబండ గ్రామ సమీపంలో సోమవారం ఉదయం గాలికి ఓ భారీ చెట్టు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో వాహనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా, వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న సిర్పూర్(టీ) ఎస్ఐ దీకోండ రమేశ్, జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు. పోలీసులు తక్షణమే స్పందించి, చెట్టును తొలగించడంతో ప్రయాణికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంచిర్యాల ఏసీసీ, జూన్ 3 : రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు మంచిర్యాల రైల్వే ఎస్ఐ టీ సుధాకర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం 4:30 గంటల ప్రాంతంలో మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో పట్టాలపై నుంచి 1వ ఫ్లాట్ ఫాం ఎక్కుతుండగా, బెంగళూర్ నుంచి పాట్నా వైపు వెళ్తున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి 40 నుంచి 45 ఏండ్లు ఉంటాయని, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ తెలిపారు. మృతుడు బ్లాక్ టీ షర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు, మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే 87126 58596, 87126 58605, 99484 81902 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

హాజీపూర్, జూన్ 3 : మండలంలోని రాపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ తహసీల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొండ్ల సురేశ్ బైక్‌పై మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన బొప్ప అమృత్‌రావు రోడ్డు దాటుతుండగా, సురేశ్ బైక్‌తో డీ కొట్టాడు. దీంతో అమృత్‌రావుకు స్వల్ప గాయాలవగా, సురేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

బాధితులకు పరామర్శ

కాసిపేట, జూన్ 3 : కాసిపేట మండలం ధర్మారావుపేటలో పిడుగు పాటుకు గురై 34 గొర్రెలు, మేకలు మృత్యువాత పడగా, బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ కాసిపేట మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడించగా, కలెక్టర్‌తో మాట్లాడి వారి కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, దుర్గం రాంచందర్, రాజన్న తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మందమర్రి, జూన్ 3 : ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మందమర్రి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో సోమవారం చోటుచేసుకున్నది. ఈ మేరకు ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్ కాలనీకి చెందిన మదిరె శ్యాంసుందర్ (30) సోమవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటిపైన ఉన్న బాత్‌రూంలోకి వెళ్లాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు తలుపులు పగలగొట్టారు. శ్యాంసుందర్ అపస్మారక స్థితిలో పడి ఉండడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది పరిశీలించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శ్యాంసుందర్ తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

మాట్లాడుతున్న సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక

సీసీసీ నస్పూర్, జూన్ 3 : మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సీసీసీ నస్పూర్ సృష్టి ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థినులకు పలు అంశాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే వెంటనే మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 1930, సఖీ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 181 చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్స్ నంబర్ 100, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్ నంబర్ 14567, ఫోక్సో యాక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ నంబర్ 112కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సృష్టి స్కూల్ కరస్పాండెంట్ అంబాల రాజ్‌కుమార్, సిబ్బంది లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంబలి పంపిణీ

కాసిపేట, జూన్ 3 : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు కొక్కిరాల రఘుపతిరావు స్మారకార్థం నిర్వహిస్తున్న అంబలి పంపిణీ సోమవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వేముల కృష్ణ, సత్తార్, ఎంపీటీసీలు పర్వతి మల్లేశ్, భీంరావు, పద్మ శంకర్, అన్నం కుమార్, రషీద్, షాకీర్, కదీర్, ఖలీం, మాజీ సర్పంచ్ మడావి వెంకటేశ్, కనక రాజు, అనంతరావు, సత్యం, కొమ్ముల బాపు, వంశీ, సాయి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమర్ మియా సభ్యులు

ఉమర్ మియా సొసైటీపై తప్పుడు ప్రచారం

- మున్సిపల్ కౌన్సిలర్, సొసైటీ సభ్యుడు మినాజొద్దీన్

మంచిర్యాలటౌన్, జూన్ 3 : ఉమర్ మియా సొసైటీపై పలువురు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటివారి మాటలు నమ్మి మోసపోవద్దని మున్సిపల్ కౌన్సిలర్, సొసైటీ సభ్యుడు మినాజొద్దీన్ తెలిపారు. సొసైటీ సభ్యులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీ కార్యనిర్వాహక వర్గం 2016లో రద్దు అయి నేటికీ కార్యనిర్వాహక ఎన్నికలు జరగనందున ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ జిల్లా కో-ఆపరేటివ్ ఆధీనంలో ఉన్నదన్నారు. గతంలో ఉమర్ మియా సొసైటీ పూర్వ సభ్యులు ఇంటి అనుమతులు ఇవ్వాలని కోరుతూ మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకోగా, కమిషనర్ తిరస్కరించినందున హైకోర్టును ఆశ్రయించారని వివరించారు. అనుమతుల విషయాన్ని చట్ట ప్రకారం పరిశీలించాలని కోర్టు ఆదేశించిందన్నారు. మంచిర్యాల మండలం గర్మిళ్ల శివారు 474, 476 సర్వే నంబర్లలో టైటిల్ డాక్యుమెంట్లు కలిగి ఉన్న వారికి అనుమతులు జారీ చేసే ముందే ఆక్షేపణలపై సమగ్ర విచారణ జరిపించాలని హైకోర్టు సూచించిందని వెల్లడించారు. గతంలో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసినందుకు, ప్రజలను మోసగించినందుకు మంచిర్యాల పోలీసులు ఉమర్‌మియా సొసైటీ పూర్వ ప్రెసిడెంట్, సెక్రటరీపై సివిల్, క్రిమినల్ కేసులతో చార్జిషీటు నమోదు చేశారని పేర్కొన్నారు. సొసైటీకి ఎలాంటి హక్కులు లేనప్పటికీ ప్రజలను మోసం చేస్తూ ఇంటి అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

పరీక్షను ఉపసంహరించుకోవాలని వినతి


సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

నస్పూర్, జూన్ 3 : ఆశ కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టే పరీక్షను ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఈ మేరకు సోమవారం ఆశ కార్యకర్తల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. కొన్నేండ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామన్నారు. తమకు వేతనాలు పెంచి, రెగ్యులర్ చేయాల్సింది పోయి పరీక్ష పెట్టడం ఏమిటని మండిపడ్డారు. వెంటనే పరీక్ష నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శోభ, విజయలక్ష్మి, పద్మ, విజయ, కవిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

మందమర్రి, జూన్ 3 : మందమర్రి పట్టణంలోని మూడోజోన్ కాలనీకి చెందిన నిరుపేద ఆటో డ్రైవర్ కలీమ్ సోమవారం మృతిచెందాడు. కాగా, అంత్యక్రియల నిర్వహణ ఖర్చులకు డబ్బు లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికుల ద్వారా తెలుసుకున్న ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, దాతల సాయంతో రూ.5వేలు అందించారు. ఆ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ అజీముద్దీన్, పట్టణాధ్యక్షుడు నందిపాట రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్, జిల్లా కార్యదర్శి గాండ్ల సంజీవ్, మండలాధ్యక్షుడు సకినాల శంకర్, ఎండీ జావీద్‌పాషా, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నివాళి


ఈశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మందమర్రి, జూన్ 3 : తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకుడు, మందమర్రి పట్టణానికి చెందిన హనుమండ్ల రవీందర్ తల్లి ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా, స్థానిక సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో కుటుంబ సభ్యులు సోమవారం ఈశ్వరమ్మ దశదిన కర్మ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఈశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాజారమేశ్, పట్టణాధ్యక్షుడు జే రవీందర్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ సీనియర్ నాయకులు ఎండీ అబ్బాస్, బడికెల సంపత్, కొంగల తిరుపతి రెడ్డి, బోరిగం వెంకటేశ్, పంజాల ఈశ్వర్, భట్టు రాజ్‌కుమార్, దాసరి అనిల్, హరీశ్, పొన్నం, జాగటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గూడెం హుండీ ఆదాయం రూ.5,89,486


హుండీ లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

దండేపల్లి, జూన్ 3 : దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణస్వామి హుండీ ఆదాయం రూ.5,89,486 సమకూరినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. 69 రోజులకు సంబంధించిన హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, దేవాదాయశాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవి కిషన్‌గౌడ్, వేదపండితులు డీ నారాయణ శర్మ, ముఖ్య అర్చకులు రఘుస్వామి, అర్చకులు సంపత్‌స్వామి, రెనవేషన్ కమిటీ సభ్యులు, శ్రీసత్యనారాయణ సేవా సమితి సభ్యులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

కోటపల్లి, జూన్ 3 : కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన విద్యార్థి కొత్తూరి స్రవంతి ఇంటర్ పరీక్షా ఫలితాల్లో (2022-23) కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా టాపర్‌గా నిలువగా, సిర్పూర్ టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. రూ.25వేల ప్రోత్సాహకం అందించారు. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన స్రవంతి, ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీఎస్ఆర్‌జేసీలో హెచ్ఈసీ పూర్తిచేసింది. కాగా, ఆమెతో పాటు, తన తల్లి స్వరూపను కళాశాలకు పిలిపించి ప్రిన్సిపాల్, ఆధ్యాపకులు సన్మానించారు. ప్రస్తుతం స్రవంతి హైదరాబాద్‌లో ఎల్ఎల్‌బీ చదువుతున్నది.

విద్యార్థినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్యారాణి, కళాశాల సిబ్బంది

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All
CHANGE OF NAME
★I,SHELKE PALLAVI MADHAV D/O SHELKE MADHAV, H.No.1-19, Vil:Kupti Tanoor,Nirmal, Now Changed my name as WAGMARE PALLAVI W/O SAHEBRAO
NTZ-324884
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677